క్లుప్తంగా

18న నేత్ర వైద్య శిబిరం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని బాప్టిస్టు చర్చిలో ఈ నెల 18వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్రీం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



ముమ్మిడివరంలో అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

ముమ్మిడివరం: శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్ శర్మ ఆధ్వర్యంలో వివిధ ద్రవ్యాలతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారి గ్రామోత్సవం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పెన్మత్స జగ్గప్ప గురుస్వామి, చిన్నారావు, సిద్దిన రమణ, ఎస్.రామకృష్ణంరాజు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సై రామకృష్ణకు ఉత్తమ సేవా పతకం



రామకృష్ణ, డీటీఆర్‌బీ ఎస్సై

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్పీ కార్యాయలంలో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో (డీటీఆర్‌బీ) ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.రామకృష్ణను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకానికి ఎంపిక చేసింది. ఉగాది కొత్త సంవత్సరం పేరుతో పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు రాష్ట్ర పోలీసు శాఖ ప్రకటించిన ఉత్తమ సేవా పతకానికి జిల్లా నుంచి ఎస్సై రామకృష్ణ ఒక్కరే ఎంపికయ్యారు. 1983లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరిన రామకృష్ణ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో పనిచేసి ఉత్తమ సేవలకు పలు రివార్డులు అందుకున్నారు. కోనసీమలో 2011లో జరిగిన క్రాప్ హాలీడే ఉద్యమ సమయంలో అనివార్యమైన పలు ఆందోళనల్లో క్రియాశీలకంగా, అంకిత భావంతో ఈయన విధులు నిర్వర్తించి అప్పట్లో ప్రభుత్వం నుంచి సేవా పతకాన్ని అందుకున్నారు. 2019లో ఎస్సైగా పదోన్నతి పొందారు. ఈయనలో ఓ పోలీసే కాకుండా కవి కూడా ఉండడంతో సాహితీవేత్తలు కూడా రామకృష్ణను అభినందిస్తున్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ కె.లతామాధురి, ఎస్బీ సీఐ కోలా రజనీకుమార్ రామకృష్ణను అభినందించారు.

పాలస్తీనాలో దురాక్రమణకు వ్యతిరేకంగా ర్యాలీ



అమలాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న షియా ముస్లింలు

అమలాపురం టౌన్: పాలస్తీనా దురాక్రమణకు వ్యతిరేకంగా అమలాపురంలోని షియా ముస్లింలు పుర వీధుల్లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక షియా ఇస్నా అసరీ మసీదులో తొలుత ఖుద్స్ డేలో భాగంగా పాలస్తీనా దురాక్రమణలపై నిరసన వ్యక్తం చేశారు. పాలస్తీనాలోని బైతుల్ ముకద్దస్ మసీదును, ఆ ప్రాంతంలోని గాజా ఇతర భూభాగాలను ఇజ్రాయిల్ అన్యాయంగా అమెరికా దేశం ప్రోద్బలంతో దురాక్రమించిన ఘటనలపై స్థానిక షియాలు వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ రాక్షస పాలన అంతమవ్వాలని నినాదాలు చేశారు. ప్రపంచ శాంతి నెలకొనాలని ప్రార్థనలు చేశారు.మసీదు అధ్యక్షుడు మహ్మద్ నిసార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్ హుస్సేన్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది.

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు దంగేటి రుద్ర, గుత్తుల సత్తిబాబు, సచివాలయ కన్వీనర్లు ఇళ్ల త్రిమూర్తులు దొమ్మేటి బాబ్జి, దంగేటి వెంకటశెట్టి, గృహ సారథులు మహిళలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి వివరించారు.

ప్రజా సమస్యలపై గ్రామసభలు

అల్లవరం: కొమరగిరిపట్నం, బోడసకుర్రు గ్రామాల్లో సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన ఆయా గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వివిధ శాఖల వారీగా ప్రజలకు అందిస్తున్న సేవలు, సాధించిన ప్రగతిని వివరించారు. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, పాల్గొన్నారు.

ఆక్వాకు లోఓల్టేజ్ దెబ్బ

- రొయ్యల చెరువుల్లో నిలిచిపోతున్న ఏరియేటర్లు
- అధికారులు పట్టించుకోవట్లేదని రైతుల ఆవేదన



లోఓల్టేజ్ సమస్యతో రొయ్యల చెరువులో నిలిచిపోయిన ఏరియేటర్

అల్లవరం: కరోనా కారణంగా రెండేళ్లుగా అంతర్జాతీయంగా మార్కెట్ లేక తీవ్ర నష్టాలు పాలైన ఆక్వా రంగానికి ఈ ఏడాదైనా కలిసి వస్తుందనుకుంటే నిరాశే ఎదురవుతోంది. రెండేళ్ల నష్టాలతో చాలా మంది రైతులు ఈ ఏడాది రొయ్యల సాగుకు మొగ్గు చూపలేదు. కొంతమంది ఆక్వా రైతులు మాత్రం ఎకరానికి 50 నుంచి లక్ష వరకు సీడు వేసి సాగు ప్రారంభించారు. అయితే ఇరవై రోజులు గడవకముందే వైరస్‌లు ఆక్వా రంగాన్ని కుదిపేశాయి. సుమారు 70 శాతం వరకు రొయ్య చెరువులు హిబ్రియో, రెడ్ గిల్, ఈహెచ్‌పీ వైరస్‌ల బారినపడ్డాయి. దీంతో ఆక్వా రంగం మళ్లీ నష్టాలు బాట పట్టాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్క మీద టెంకాయ పడినట్లు ఆక్వా చెరువుల్ని లోఓల్టేజ్ సమస్య పట్టి పీడిస్తోంది. ఎంతగా మొర పెట్టుకుంటున్నా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో రైతులంతా డీలాపడిపోతున్నారు.

ఆగిపోతున్న ఏరియేటర్లు

వైరస్‌ల కారణంగా రొయ్యల చెరువుల విస్తీర్ణం గణనీయంగా తగ్గడంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు లోఓల్టేజ్‌తో విద్యుత్‌ని సరఫరా చేస్తున్నారు. దీంతో రొయ్యల చెరువుల్లో అమర్చిన ఏరియేటర్లు విద్యుత్ పూర్తిస్థాయిలో అందక నిలిచిపోతున్నాయి. ఏరియేటర్లు తిరగకపోతే నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి రొయ్యలు చనిపోయే ప్రమాదముంటుంది. మూడునాలుగు ఏరియేటర్లకు గాను ఒకటోరెండో నిలిచిపోతున్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. అల్లవరం మండలంలోని అల్లవరం, బెండమూర్లంక, దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తీవ్రంగా మారింది. చీకటి పడితే చాలు విద్యుత్ లోడు దారుణంగా పడిపోతుంది. అర్ధరాత్రి 12 గంటలైనా విద్యుత్‌కు లోడు అందని పరిస్థితి. ఈ సమయంలో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ శాతం గణనీయంగా తగ్గిపోతుంది. రొయ్యల చెరువుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు లోడు అందక రోజులో నాలుగు నుంచి ఐదారు సార్లు ఫీజులు కాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లోడు పెంచాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రంగాన్ని కాపాడాలంటే పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

> **రెండు రోజుల్లో పరిష్కరిస్తాం**
>
> క్షేత్రస్థాయిలో లోఓల్టేజీ సమస్య ఉందని గుర్తించాం. ఎండలు బాగా పెరగడంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. వినియోగానికి అనుగుణంగా లోడు పెంచాల్సి ఉంది. రెండు రోజుల్లో సమస్యని పరిష్కరిస్తాం.
>
> – ఆర్.సూర్యనారాయణ, ఏఈ, ఏపీఈపీడీసీఎల్, అల్లవరం

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత



పటవల వలంటీర్ జ్యోతికి నియామకపత్రం అందజేస్తున్న ఎంపీపీ సునీత

తాళ్లరేవు: గ్రామ వలంటీర్లుగా నూతనంగా నియమితులైన ముగ్గురికి ఎంపీపీ రాయుడు సునీత శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పటవల గ్రామానికి చెందిన తిరిగటి జ్యోతి, తాళ్లరేవుకు చెందిన బూసారపు కుమారి, కోరంగి గ్రామానికి చెందిన కర్రి హేమలతకు నియామక పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, మండల పరిషత్ కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ పాల్గొన్నారు.

వాడవాడలా అంబేడ్కర్ జయంతి

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు అమలాపురం నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. జోహార్ అంబేడ్కర్ నినాదాలతో, తీన్‌మార్ డప్పులతో, గారడీల సందడితో ఊరేగింపులు సాగాయి. స్థానిక గడియారం స్తంభం సెంటరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు మంత్రి విశ్వరూప్ హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు నివాళులర్పించారు. అమలాపురంలోని పలు అంబేడ్కర్ విగ్రహాల వద్ద జరిగిన జయంతి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కుడుపూడి త్రినాథ్, కౌన్సిలర్లు బండారు గోవిందు, కట్టోజు సన్యాసయ్యదాసు, చిత్రపు రామకృష్ణ పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



అమలాపురంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్, కౌన్సిలర్లు

ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సుసరాపు శ్రీధర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ మార్గ్, కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ పి.పార్థసారథి, ఎస్బీ సీఐ కోలా రజనీకుమార్ పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: నగర పంచాయతీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే పొనాడ వెంకట సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, వైఎస్సార్ సీపీ నాయకులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ శాఖ, మండల కాంగ్రెస్ పార్టీ, మండల మాలమహానాడు, చైతన్య యూత్ వెల్ఫేర్, తహసీల్దార్ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన, పల్లంకుర్రు, గెద్దనపల్లి, దొంతికుర్రు, కందికుప్ప, చెయ్యేరు, ఉప్పూడి, పెనుమల్లే, లక్ష్మీవాడ, బంటుమిల్లి గ్రామాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. కాట్రేనికోనలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, నల్లా నరసింహమూర్తి, జగడం బాలయ్య పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీధర్

తాళ్లరేవులో..

తాళ్లరేవు: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ఎండీయూడబ్ల్యూఏ ఆధ్వర్యంలో 25 కిలోల భారీ కేకును నేతలు కట్ చేశారు. చంద్రమౌళి, జక్కల ప్రసాద్ చీరలు పంపిణీ చేశారు. జాతీయ రహదారి 216లోని సాయిచంద్ర కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి సుంకరపాలెం సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు నివాళులు అర్పించారు.

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకీ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక బాలయోగి పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ పూలమాల వేసి, కేకు కట్ చేసి పంచారు. సర్పంచ్ కడిమి చిన్నవరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, హార్టికల్చర్ యూనివర్సిటీ సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రిబాబ్జి, పినిపే జయరాజ్ పాల్గొన్నారు.



నల్లవంతెన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్డీవో వసంతరాయుడు

చల్లపల్లిలో...

చల్లపల్లి పంచాయితీ పరిధి జగ్గిరాజు పేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచే రమణారావు రూ.10 లక్షల వ్యయంతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సిటీ డీసీపీ మోకా సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని, విగ్రహావిష్కరణ చేశారు.

యానాంలో..

యానాం: పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ నివాళులర్పించారు. గోపాల్‌నగ్‌లో అంబేడ్కర్ విజ్ఞాన్‌భవన్‌లో నిలువెత్తు అంబేడ్కర్ కాంస్యవిగ్రహానికి, అనంతరం టాక్సీ స్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ చైతన్య ర్యాలీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేలాదిమంది యువకుల ఆధ్వర్యంలో జైభీమ్ ర్యాలీని నిర్వహించారు. పాతబస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కురసాంపేట, పరంపేట మీదుగా రమాభాయినగర్ వరకు సాగింది.



యానాంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి

అమలాపురం రూరల్: అమలాపురం నల్లవంతెన వద్ద అంబేడ్కర్ భవనం, ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేడ్కర్ విగ్రహాలకు ఆర్డీవో వసంతరాయుడు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

అమలాపురం రూరల్‌లో..

అమలాపురం రూరల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీ హరిరామ్ గోపాల్, ఎంపీడీఓ కేవీ ప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వన్నె చింతలపూడి స్తంభంగోయ్య, ముంగండ వారి పేటలో అంబేడ్కడర్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, సొసైటీ చైర్మన్ జంపన రమేష్ రాజు, ఎంపీటీసీ సభ్యులు పరమట నాగమణి విష్ణుప్రసాద్ నివాళులర్పించారు. బండారులంకలో సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ జెడ్పీటీసీ చింతాశంకర్ మూర్తి ఎంపీటీసీ గుత్తుల జానకి లక్ష్మి నివాళులర్పించారు. సమనసలో కరికరల కర్షభక్తల కార్పొరేషన్ డైరెక్టర్ కర్రేళ్ల రమేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు ముసలి స్వరన్‌రాజు నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ నివాళి

అల్లవరం: గోడిలోని అంబేడ్కర్ నగర్‌లో జరిగిన జయంతి వేడుకల్లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ నివాళులర్పించారు. కొమరగిరిపట్నం కాపుల వీధిలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. డీపీపీఓ ఎస్.మధుసూదనరావు నివాళులర్పించారు. తుమ్మలపల్లిలో ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాదు పాల్గొన్నారు.



గోడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఐ పోలవరం: కేశనకుర్రులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు అధ్యక్షతన నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎదుర్లంకలో జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఐ పోలవరం, పాత ఇంజరంలో ఎంపీపీ మోర్త మిరియాంజ్యోతి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాత ఇంజరంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు గంటి హరీష్, మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు నివాళులర్పించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు జరిగాయి.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

అల్లవరం: మండలంలోని మొగళ్ళమూరు సెంటర్లో బస్ షెల్టర్‌ను ఆనుకుని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై శుక్రవారం వివాదం చోటు చేసుకుంది. అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విగ్రహాన్ని తొలగించి పంచాయతీలో ఉంచారు. దీంతో అంబేడ్కర్ అభిమానులు నిరసన తెలిపారు. ఈ ఘటనపై ఎంపీ అనురాధ ఇరువర్గాల వారితో చర్చలు జరిపి అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పెట్టిన విగ్రహాన్ని తాత్కాలికంగా ఉంచి జయంతిని నిర్వహించుకోవాలని సూచించారు. జయంతి కార్యక్రమం అనంతరం విగ్రహాన్ని తొలగించాలని సూచించడంతో ఇరువర్గాలు అంగీకరించాయి.

పోలీసుల చర్చలతో సద్దుమణిగిన వివాదం

అమలాపురం టౌన్: స్థానిక విత్తనాల వారి కాల్వగట్టు వీఎస్ఆర్ కాలనీ వద్ద గురువారం అర్ధరాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదం ఏర్పడింది. ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడంపై కాలనీ వాసుల్లో కొందరు అభ్యంతరం చెప్పారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు పోలీసులు జరిపిన చర్చలు సఫలం కావడంతో వివాదం సద్దు మణిగింది.

ఉన్నత స్థితికి చేర్చేదే ధ్యానం

అమలాపురం టౌన్: ధ్యానం మనిషిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి... అజ్ఞానం నుంచి ఆత్మ జ్ఞానం వైపునకు తీసుకుని వెళుతుందని రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబూలో గల ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ మోటివేషన్ స్పీకర్ బీకే సూరజ్ బాయ్ అన్నారు. అమలాపురం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక రవణం వీధిలో ఇటీవల నిర్మించిన మెడిటేషన్ రిట్రీట్ సెంటరులో శుక్రవారం ప్రారంభమైన యోగభట్టీ శిక్షణ తరగతుల్లో సూరజ్ బాయ్ ముఖ్య అతిథిగా ఉపన్యసించారు. తొలుత ఆయనతోపాటు వివిధ జిల్లాల ఓం శాంతి ఇన్‌చార్జిలు జ్యోతి వెలిగించి యోగ భట్టీని ప్రారంభించారు. సంపూర్ణత కోసం సూక్ష్మ పరివర్తనా భట్టీ పేరుతో జరుగుతున్న ఈ శిక్షణ తరగతుల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు. రాజయోగీలు బీకే గీతా బెహెన్జీ, బీకే సందీప్ బాయిజీ, బీకే అమిత్ బాయిజీ ధ్యానం, యోగాలపై శిక్షణ ఇస్తున్నారని అమలాపురం ఓ శాంతి కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి తెలిపారు.



యోగ శిక్షణ తరగతుల్లో ఉపన్యసిస్తున్న బీకే సూరజ్ బాయ్

అంధులు, దివ్యాంగులకు ఎస్‌బీఐ వితరణ



అంధుల పాఠశాలకు వాషింగ్ మెషీన్‌ను అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎస్‌బీఐ తన సీఎస్ఆర్ సేవా కార్యక్రమాల్లో భాగంగా రూ.50 వేలతో అంధులు, దివ్యాంగులకు పలు వితరణ కార్యక్రమాలు శుక్రవారం చేపట్టింది. స్థానిక లూయి అంధుల పాఠశాలకు రూ.30 వేల విలువైన వాషింగ్ మెషీన్, హరి మనో వికాస మానసిక దివ్యాంగుల కేంద్రానికి రూ.20 వేల విలువైన ఫ్యాన్లు, మిక్సీ తదితర వస్తువులు సమకూర్చారు. వీటిని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్.గునేశ్వరరావు, ఎస్‌బీఐ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.యశ్వంత్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుందరరావు, ఎస్‌బీఐ హెచ్ఆర్ మేనేజర్ మురళీ చేతుల మీదుగా అంధులు, దివ్యాంగులకు అందజేశారు. వారి సమక్షంలోనే అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఎస్‌బీఐ అధికారులు హరిప్రసాద్, హరీష్ పాల్గొన్నారు.



అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

ఖురాన్ పఠనం... పేదలకు సాయం

అమలాపురం టౌన్: పట్టణంలోని ముల్లా ముస్తాఫా, జామియాన మసీదుల్లో పవిత్ర రంజాన్ మాసం నాలుగో శుక్రవారం కావడంతో ముస్లింలు నమాజ్‌లు చేశారు. ముల్లా ముస్తాఫా మసీదుకు రంజాన్ సందర్భంగా బిహార్ నుంచి వచ్చిన అఫీస్ సద్దాం హుస్సేన్ ముస్లిం మత గ్రంథం ఖురాన్‌ను పఠించారు. రంజాన్ మాసంలో ప్రతీ ముస్లిం జకాత్ పిత్రాలో భాగంగా డబ్బుల్లో కొంత తీసి పేదలకు వస్త్రాలు, ఆర్థిక సాయం చేయడం వంటి వితరణ కార్యక్రమాలు చేపడతారు. ముస్లిం పెద్దలు మహ్మద్ అమీర్, మహ్మద్ ఆజామ్, షేక్ అబ్దుల్ ఖాదర్, మహ్మద్ బషీర్ నమాజ్‌లో పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జగన్ పాలన

ఐ.పోలవరం: ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రజల ఆశీస్సులే ఆయనకు బలమని జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎదుర్లంకలో ఆయన జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికి జగన్ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారన్నారు. టీడీపీ కుట్ర, స్వార్థ రాజకీయాలను ప్రజలు గమనించాలని, ఈ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రిగా రావాలని, అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎదుర్లంక, పాత ఇంజరం, ఐ.పోలవరం, జి.మూలపాలెం, కొమరిగిరి, తదితర గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పలుఇళ్లకు వెళ్లి వారి అనుమతితో స్టిక్కర్‌ను అతికించారు.



ఎదుర్లంకలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సతీష్‌రాజు

అంబేడ్కర్ యువత ఆందోళన

- డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కొందరు యువకులు మోటారు సైకిళ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఊరేగుతున్నారన్న ఆరోపణపై డీఎస్పీ వై.మాధవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కొన్ని మోటారు సైకిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో యువకులు డీఎస్పీ కార్యాలయం ఎదుట రోడ్డుపై ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి పినిపే విశ్వరూప్ అక్కడకు చేరుకుని డీఎస్పీతో మాట్లాడారు. ఆ మోటారు సైకిళ్లు ఎందుకు స్వాధీనం చేసుకోవాల్సి వచ్చిందో డీఎస్పీ మాధవరెడ్డి, పట్టణ సీఐ దుర్గాశేఖరరెడ్డి మంత్రికి వివరించారు. చివరకు మంత్రి సూచనతో స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లను పోలీసులు విడిచిపెట్టారు. మంత్రితో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.



డీఎస్పీ మాధవరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

ముస్లింల సంక్షేమానికి కృషి

యానాం: నియోజకవర్గ పరిధిలోని మైనారిటీ వర్గాలైన ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మజీద్ ఏ క్యూబాలో ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ముస్లింలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నదే తన ఉద్దేశమన్నారు. అంతకుముందు మసీదుకు వచ్చిన ఎమ్మెల్యే అశోక్‌ను ఘనంగా సత్కరించారు. ఎమ్‌డీ కాలేషా, తాజుద్దీన్, అన్సారీ, కాలేషా మస్తాన్, మొయినానవాజ్, ఫిరోజ్ మహ్మద్, జిలానీ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరించిన ముస్లింలు